# ఆత్మహత్య

భార్య ఆత్మహత్య చేసుకున్నా, భర్త ఆత్మహత్య చేసుకున్నా లోకుల గుండెల్లో దానిభావం భార్య శీలం కోల్పోవడం. ఎంతన్యాయం?

—జయప్రద

"అబ్బ! ఎంత బాగుందిరా ఇక్కడ. ఈ విజయవాడ వీధుల్లో మీ మనసుకి పట్టే మురికినిక్కడ కడిగేసుకోవచ్చు" చుట్టూ పరవశంగా చూస్తూ అన్నాడు మూర్తి.

నాకప్పుడప్పుడు మనస్సు బాగలేనప్పుడిలా రావడం మామూలే. ఎక్కడా దొరకని శాంతి కనీసం నా శ్రీమతి కూడా ఒక్కొక్కప్పుడు ఇవ్వలేని ప్రశాంతి నాకీకొండలమధ్యే దొరుకుతుంది. దుర్గ గుడికి, కృష్ణానదికి మధ్యగా పైకి ఎగబాకే ఈ కొండ అంటే నాకు అమితమైన ప్రీతి. మేమిద్దరం అలా కొండమీదనుండి క్రింద కొచ్చే తారురోడ్డు మీదుగా నిశ్శబ్దంగా నడుస్తున్నాం.

"కృష్ణ చూడూ ఎలా పరవళ్ళు తొక్కుతుందో!" అన్నాడు నా స్నేహితుడు చేతిలో కొబ్బరికాయ గోడమీద పగలకొట్టి ముక్కలు చేస్తూ.

ఈ కొండమీదనుండి కృష్ణాబ్యారేజ్ క్రిందుగా విపరీతమైన ఒర వడితో ప్రవహించే నీరు నురుగులు క్రక్కుతోంది. సంధ్య గూటికి చేరే సమయం. పడమటి ఆకాశాన్నాక్రమించిన సింధూరపు రంగు నన్ను భావుకతలోకి తోసేసింది.

"అరు!ణ్" మూర్తి గొంతులో కాస్త కుతూహలం, ఇంకాస్త ఆందోళన.

ఉలిక్కిపడి చూసాను. అంతవరకు నేనానందించిన కృష్ణ నీళ్ళల్లో తేలివచ్చిన ఒక స్త్రీమూర్తి శవం.

నేను, నా స్నేహితుడు సహజమైన కుతూహలంతోకృష్ణా బ్యారేజి మీద నిల్చుని వంగి చూసాం.

మా క్రిందుగా గట్టుమీదకు కొట్టుకొచ్చిన ఆ స్త్రీ మూర్తి చుట్టూ మూగిన జనం.

నేను రచయితను కాను. కానీ నాలో విపరీతమయిన జిజ్ఞాస మాత్రం వుంది. నాలో సృజనాశక్తి లేదు. ఒక కథా వస్తువును సృష్టించే నేర్పు లేదు-కానీ ఇలాటి చిన్న సంఘటనలనుండి ఏరుకున్న కథా వస్తువుతో రెండు మూడు కథలు వ్రాసాను· అవి నాకే నచ్చలేదు కానీ నాలో జిజ్ఞాస మాత్రం చావలేదు.

"ఉహుఁ నేను హర్షించను. ఆత్మహత్య సమస్యలకు సొల్యూషన్ కాకూడదు" అన్నాను నేను. నాలో కలిగే భావాల్ని దాచుకునే అలవాటు నాకు లేదు.

"అందరూ నీ అంత అదృష్టవంతులు కాదు భయ్యా! వేల సమస్యలతో జీవించే మనుష్యులు. ఏనాడో ఒకనాడు మనో ధైర్యాన్ని

పోగొట్టుకుంటారు. ఆ బలహీనపు క్షణం దాటితే వాళ్ళాపని చేయలేరు అరుణ్. ప్రతి ఒక్కరికి ఈ బ్రతుకుని ఇంకాస్త అందంగా మలుచుకుని బ్రతకాలనే కోరిక అంతర్గతంగా వుండనే వుంటుంది."

"అయితే నువ్వు ఆత్మహత్యను సమర్థిస్తున్నావన్నమాట" ఇంకాస్త వంగి అన్నాను.

"లేను....లేదు యదార్థం చెపుతున్నానంతే. వాళ్ళనర్థం చేసుకుంటున్నానంతే."

"పిరికివాళ్ళంటాను నేను"

"కాదు అరుణ్! అందరూ అన్ని వేళలా పిరికివాళ్ళు కారు. ఎప్పుడో ఒకప్పుడు ప్రతి ఒక్కరం పిరికివాళ్ళ మవుతాం. ఎవరో ఒకరి గుండెల్లో తల దూర్చి బావురుమని ఏడ్వాలనే దుర్బలత్వం నీలో ఎప్పుడూ కలగలేదా?"

నేను ఆలోచిస్తున్నాను.

"పద అలా దగ్గరకెళ్ళి చూసివస్తాం" నా స్నేహితుడు నా జవాబు కొరకు ఆశించకుండా ముందుకు కదిలాడు.

మేమిద్దరం చుట్టూ తిరిగి గట్టుదిగి వెళ్ళి కృష్ణ ఒడ్డుకు చేరాం.

కృష్ణ నీటి అలలలో గట్టునున్న శవం ఇంకా కొద్దికొద్దిగా తడుస్తోంది.

"ఎందుకు చనిపోయిందో ఏమిటో పాపం"

ఎవరిదో సానుభూతి.

"ఎందుకేమిటి? ఈ రోజుల్లో ఆడపిల్లలు హద్దుల్లో వుంటున్నారా? ఏదో కాలు జారుంటుంది"

ఉలిక్కిపడి ఆ అన్న వ్యక్తివేపు చూసిన ఆ వ్యక్తి నలభై అయిదేళ్ళ స్త్రీ.

"కాదు–కాదు ఆ అమ్మాయి మెళ్ళో మంగళసూత్రం వుంది"

"అయితే ఏదో అక్రమ సంబంధమయ్యుంటుంది"

వాళ్ళు వెళ్ళిపోయారు.

మేమింకా ఆ శవంవైపుగా నడిచాం.

గులాబీరంగు ఛాయతో ఉబ్బిపోయినా ఇంకా ఆమె ముఖసౌంద ర్యాన్ని చాటుతూ చారడేసి కళ్ళు జీవరహితంగా వున్నాయి.

"అయినా ఎందుకొచ్చిన లేనిపోని అశాంతి? గుట్టుగా కట్టుకున్న వాడితో వుండే పోలా? ఏవో కోర్కెలు మరలా సమాజాన్ని ఎదిరించ లేరు-ఇదో ఇలా ఆత్మహత్యలు"

మరలా ఉలిక్కిపడ్డాను.

ఆలా అన్న వ్యక్తివైపు తిరిగి కుతూహలంగా అడిగాను.

"ఆమె మీకు తెలుసా?"

"తెలీదు"

"మరి ఆ అమ్మాయి కథ మీకెవరు చెప్పారు?"

"ఎవరో చెప్పాలా? అమాత్రం అర్థంకాదూ?"

ఆ యాభయ్యేళ్ళ బ్రాహ్మణుడి జంధ్యంవేపు జుగుప్సగా చూసాను నా స్నేహితుడు నావేపు చిరునవ్వుతో చూస్తున్నాడు.

అతను మమ్మల్ని దాటుకుని ఆ శవాన్ని చీదరించుకుంటూ వెళ్ళి పోయాడు.

నేనింకాస్త ముందుకు నడిచాను.

"పాపం ఎవరో ఆడకూతురు కాలుజారుంటుంది మొగుడు తరిమే సుంటాడు"

ఎవరిదో దూరాన సానుభూతి.

నా గుండెల్లో ఏదో సందడి.

కృష్ణమ్మ మీదుగా సాగివచ్చే చల్లటి గాలులు, నాకష్టమైన మట్టి వాసన, ఆ సంధ్యకాంతి ఇవేమీ ఇప్పుడు నన్ను తాకడంలేదు.

శీలం పోగొట్టుకున్న ఆడది చచ్చిపోవాలా?

అదే నన్ను ప్రశ్నిస్తున్న ప్రశ్న.

అదే ప్రశ్న నా స్నేహితుడినేసాను.

వాడు అదే చిర్నవ్వుతో ఎదురుప్రశ్న వేసాడు—

జీవితాల్లో వేలాది సమస్యలుండగా ఆమె చావుకు కారణం నువ్వు కూడా ఆమె శీలాన్ని కోల్పోవడమేననుకుంటున్నావా?"

నేనిక్కడ ఆలోచనలో పడ్డాను.

నిజమే! యీ పోటీల జీవితాల్లో దినదినం ఎన్ని సమస్యలు?

ఏది కాకూడదు ఆమె ఆత్మహత్యకు కారణం?

దరిద్రం ఒంటరితనం తట్టుకోలేని కడుపున పుట్టిన బిడ్డ మృతి, ఏది కాకూడదు ఆమె విరక్తికి కారణం?

ఏదయినా కావచ్చని నిర్ణయించుకున్న నాలో మరో సందేహం.

"ఒకవేళ అమె శీలం కోల్పోయినా ఆత్మహత్య చేసుకోవాలా?"

ఈసారి స్నేహితుడి పెదాలమీద చిరునవ్వు మాయమైంది.

"నిజమే చేసుకోనవసరం లేదు కానీ శీలం పోగొట్టుకున్న ఆడదానికి మరోమార్గం చూపడంలేదు మనం.

వాళ్ళు వేశ్యలగానయినా మారాలి లేదా ఆత్మహత్య చేసుకోవాలి ఇదీ మనం వాళ్ళకు చూపిస్తున్న దారి-ఇదీ మన సమాజం"

"అయితే మూర్తీ! ఈ దేశంలో చాలామంది మగవాళ్ళు ఆత్మహత్య చేసుకోవాలి"

నా ఆవేశానికి నవ్వేసాడు మూర్తి.

"నిజమే అరుణ్! కానీ స్త్రీ శీలానికి మాత్రమే మన సమాజం అంత ప్రాముఖ్యతనిచ్చింది"

"అయితే మరి రాబందుల్లా మన మగమూక అంత విలువయిన శీలాన్ని దోచుకోవటానికెందుకు ప్రయత్నిస్తున్నట్టు?"

నిశితంగా నావైపు చూసాడు మూర్తి ఆ తర్వాత.

"రా పోదాం" అని నా చెయ్యి పట్టుకున్నాడు.

"నువ్వు నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు" వెనక్కి నడుస్తూ అన్నాడు.

"నీకే అలాటి అవకాశం వస్తే నువ్వు జారవిడుచుకుంటావా?"

వాడు నవ్వుతూనే అన్నా అది నా గుండెల్లోకి చురకత్తిలా చొచ్చుకుపోయింది.

నన్ను నేను ఆత్మ పరిశీలన చేసుకునే ప్రశ్న అది.

"నేనలాటి పని చేయగలనా? నువ్వు నాకొద్దు నీ స్పర్శ నాకు అవహ్యం అనే ఆడదాన్ని నేను కోరగలనా? నేను తాకగలనా?"

"నేను జంతువుని కాను మనిషిని" అన్నాను బాధగా.

నా స్నేహితుడు ఈసారి పెద్దగా నవ్వాడు.

"ఊహుఁ జంతువులు ఈ విషయంలో మనుష్యులకంటే నయం"

మా పక్కగా పోలీస్‌వ్యాన్‌లోకి ఆ స్త్రీ శవం మోసుకుపోబడుతోంది.

బిడ్డగా, భార్యగా, తల్లిగా ఎవరికెన్ని సేవలు చేసిందో, వాళ్ళ చేత ఆఖరి ప్రయాణంలో కూడా రుణం కోరకుండా నిరాశ్రయంగా వెళ్ళిపోతుందా అమ్మాయి.

ఆమె చావుకు కారణం నాకూ తెలీదు. నాలాగే ఇక్కడ గుంపులుగా వున్న జనానికీ తెలీదు కానీ అందరి మస్తిష్కాల్లో ఒక్కటే ఊహ.

ఆమె చావుకు ఊహాగానం ఒక్కచే-శీలం.

జనమంతా వెళ్ళిపోయారు.

మేమిద్దరం ఎవరి ఆలోచనల్లో వాళ్ళం నిలిచిపోయాం. మొదట మూర్తి తేరుకున్నాడు

"పద! నా ట్రెయిన్‌కు టైమవుతోంది"

నేను నా స్నేహితుడ్ని అలవాటు ప్రకారం ఆలస్యంగా వచ్చిన ట్రెయిన్‌ని ఎక్కించి ఇంటికి చేరినా, ఆ కృష్ణఒడ్డున- నిరాశ్రయంగా దొర్లివచ్చిన ఆ స్త్రీమూర్తి శవం నా ఆలోచనల్లోనుంచి తప్పుకోవడం లేదు.

నాకు చాలా అశాంతిగా వుంది.

స్త్రీలను శారీరకంగా బలహీనుల్ని చేసిన సృష్టిమీద, ఆర్థికంగా బలహీనుల్ని నేసిన ఈ చట్టాలమీద. ఆమెమీద ఎన్నో బాధ్యతలుంచిన ఈ సమాజంమీద కసిగా వుంది.

అయినా నా అశాంతిని ఎవరితోనైనా పంచుకోకపోతే నిలువ లేనంత బాధగా వుంది. అందుకే నా రాకనింకా గమనించని శ్రీమతిని పిలిచాను....

నా మొదటి పిలుపుకే పలికింది శ్రావణి.

"వస్తున్నా" అనే పదం పూర్తి చేయకముందే వచ్చేసింది.

వచ్చీరాగానే—

"ఇది విన్నావా? మన నాలుగో ఇంటి వెంకట్రావ్ లేడూ అమాయకుడు-అతను ఆత్మహత్య చేసుకున్నాడు పాపం"

"ఆత్మహత్య....ఆత్మహత్య....ఆత్మహత్య"

"ఆ పార్వతమ్మ ఏమి పతివ్రత కబుర్లు చెప్పేదనీ...."

"వెంకట్రావు ఆత్మహత్యకూ, పార్వతమ్మ పాతివ్రత్యానికి ఏమిటి సంబంధం?" విసుగ్గా అన్నాను.

"అయ్యో చోద్యం· వాళ్ళిద్దరూ భార్యభర్తలండీ" అంది నా శ్రీమతి నన్నమాయకుడి కింద జమకట్టేస్తూ.

"అయితే...."

శ్రావణి హఠాత్తుగా స్వరం తగ్గించింది.

"వెంంట్రావుని అమాయకుణ్ని చేసి ఎవడితోనో పార్వతమ్మ సంబంధం పెట్టుకునుండాలంటున్నారండీ అంతా"

"నోర్ముయ్" అరిచాను.

బిత్తర పోయింది శ్రావణి.

నా తిరస్కారం ఎలా వ్యక్తం చేయాలో తెలియక అలా ఆమె మీద అరిచాను కానీ ఇది మార్గంకాదు. నా భార్య నోరు ముయ్యిస్తే చాలదు. ఆడది ఆత్మహత్య చేసుకున్నా, మగవాడు ఆత్మహత్య చేసుకున్నా కారణం కేవలం ఆడదాని శీలానికి సంబంధంచిందేనా? ఎంత సంకుచిత్వం మనలో! దాన్ని సమాజంలో పోగొట్టాలంటే నేనేం చేయాలి? ఏం చేయాలి? ఆలోచిస్తున్నాను.

*